# చెర

సోమవారం–పగలు పది గంటలు.

తన సీట్లో కూర్చుంది సీత. ఎదురుగా కవరు. చించి చదివింది.

“ సీతా ! నువ్వు విధించే ఏ షరతునైనా అంగీకరిస్తాను. నన్ను కరుణించు...ప్లీజ్...”

‘ నీ దయరాదా ఈ దాసుపైనా... ’

పళ్ళు పటపటలాడించింది సీత. “ రాస్కెల్ వీడి వెర్రి వేషాలు రోజు రోజుకూ మితిమీరి పోతున్నై ” అనుకుంది. కాగితాన్నీ కవర్నీ చించబోయి ఆగింది. రెంటినీ తీసి తన డైరీలో దాచుకుంది.

పక్క సీట్లో శేఖరం ‘ గుడ్ మార్నింగ్ ’ చెప్పి సీతకేసి మూగగా చూశాడు.

అది అతని అలవాటు. సీతకేసి అలా చూస్తూ వుంటాడు ఆ చూపుల్లో ఆరాధన వుంది. ఆ చూపులు తెలిపే భావాల్లో

కొన్ని అర్థమౌతూనే వుంటాయి సీతకి. ముభావంగా ' గుడ్ మార్నింగ్ ' అంది.

శేఖరం సీతకేసి చూస్తూ వుండిపోయాడు.

తనకు ఈ ఉత్తరం రాసిందెవరో సీతకు తెలుసు. అతను ఆ ఆఫీసులోనే వేరే సెక్షన్‌లో పనిచేసే సుందరం.

సుందరం ఆగర్భ శ్రీమంతుడు. అతను ఆ వూళ్ళో పెద్ద షాపింగ్ సెంటర్‌కి యజమాని.

చైనావాడి కలాలూ, కత్తెరలనుంచీ దేశంలోని అన్ని కంపెనీల ఫ్రిజ్‌లూ, ఫర్నిచర్‌ల వరకూ సమస్త వస్తువులూ ఆ షాప్‌లో లభిస్తాయి.

ఆ షాప్ వెనక గెస్ట్‌రూమ్‌లున్నై. ఆ రూముల్లో హిరాయిన్, విస్కీ, హీరోయిన్‌ల వంటి ఇతర సుఖాలూ వి ఐ పీ లకి సమృద్ధిగా లభిస్తాయని వారూ వీరూ చెప్పుకోవడమూ సీతకు తెలుసు.

సుందరం సరదాగా ఆఫీసు కొస్తాడు. మస్టర్‌లో సంతకం పెట్టి రోజు జీతాన్ని సంపాయించుకుంటాడు. ఆ తర్వాత ఓ అరగంటసేపు పై అధికారులకు ట్రైన్ టిక్కెట్లో, ప్లేన్ టిక్కెట్లో, గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటుచేయడం గురించి ఒకరిద్దరు ఆఫీసర్లతో చర్చిస్తాడు. ఆ రోజుకి అతని పని అంతే. ఇలా రోజూ అతను చేసే ఈ పనికి కంపెనీ అతనికి నెలకో రెండువేల ఐదువందలు జీతం పేరుతో ఆనందంగా అందిస్తుంది.

ఉదయం జరిగిన సంఘటన గుర్తు కొచ్చింది సీతకి. తాను ఆఫీసుకి నడచి వస్తోంది. స్కూటర్‌మీద వెళ్తూ తన పక్కగా వచ్చి స్లో చేసేడు సుందరం. సన్నగా ఈల వేశాడు. "బెస్టాఫ్‌లక్" అని వెళ్ళిపోయాడు. అంటే తనకంటే వో పది నిముషాలు ముందు వచ్చి—లెటర్ రాసి తన సీట్లో వుంచి వెళ్ళాడన్నమాట.

"బ్రూట్" అనుకుంది. సీతకి చిరాగ్గా వుంది. కోపంగా వుంది. కసిగానూ వుంది. వీడికి ఎలా బుద్ధి చెప్పడమా అని ఆలోచిస్తూ చాలాసేపు గడిపింది.

ఇంతలో మేనేజర్ పిలిచాడు.

ఆ తర్వాత ఆఫీసు రొటీన్‌లో పడిపోయింది.

*　　　*　　　*

పగలు పదకొండు గంటలు.

"మీ కోసం ఎవరో వచ్చారు. విజిటర్స్ రూమ్‌లో కూర్చోబెట్టాను" ప్యూన్ వచ్చి చెప్పాడు. ఎవరై వుంటారా అనుకుంటూ కుర్చీలోంచీ లేచింది సీత. హాల్లోకి వచ్చింది.

పాంట్ జేబులో చేతులు పెట్టుకుని కంపెనీ తాలూకు పబ్లిసిటీ పోస్టర్లని చూస్తున్నాడు బలరాం.

"ఎప్పుడొచ్చావ్‌రా" అంటూ సోఫాలో కూర్చుంది. బలరాం కూడా కూర్చున్నాడు. "బస్ దిగి సరాసరి ఇక్కడికే వస్తున్నా".

కుశల ప్రశ్నలు అయిన్నై. ప్యూన్‌ని పిలిచి కాఫీకి కబురు చేసింది. ఈలోగా తానే లేచి వెళ్ళి కూలర్లో నీళ్ళు తాగి వచ్చాడు బలరాం. కాఫీ వచ్చింది. ఇద్దరూ తాగేరు. జేబులోనుంచీ సిగరెట్ తీశాడు.

"ఇదెప్పట్నుంచీ..." ఆశ్చర్యంగా అడిగింది సీత.

"సారీ అక్కా...వో నెలనుంచీ అలవాటయింది. ఫోర్సాఫ్ హాబిట్. కాఫీ తాగగానే తటాలున చేతులు తమ పని తాము చేసేసిన్నై".

సన్నగా నవ్వుకుంది సీత. గౌరవాన్ని పాటించనందుకు సంజాయిషీ యిస్తున్నాడు, తమ్ముడు. నిన్న మొన్నటిదాకా తాను తలదువ్వి షర్ట్ బటన్స్ పెట్టి స్కూల్‌కి పంపేది. ఇవ్వాళ వీడు కాలేజ్ స్టూడెంట్. స్టెప్ కటింగూ, బెల్‌బాటమ్, సిగరెట్టూ వచ్చేసిన్నై.

బలరాం చేష్టలు శరాల్లా గుచ్చుకుంటున్నై సీతకి. అయినా—వాడు తన తమ్ముడు. సీత స్తబ్దంగా కూర్చుండి పోయింది.

అక్క ఆలోచన ఏ విషయంమీద పరిభ్రమిస్తున్నదో పసిగట్టి సకిలించేడు, బలరాం. సీత ప్రస్తుతాని కొచ్చింది.

"చెప్పు ఏంవిటి విశేషాలు?" అడిగింది.

"మా ఫ్రెండ్సంతా అజంతా ఎల్లోరా బాంబే ఢిల్లీ ఎక్స్‌కర్షన్ పోతున్నారు..." నసిగేడు.

సీత మాట్లాడలేదు. తమ్ముడికేసి సాలోచనగా చూసింది. చూపులు మరల్చుకుని సిగరెట్ ఆర్పి యాష్ట్రేలో వేశాడు బలరాం.

"ఏంవిటక్కా— అన్నిటికీ అంతగా ఆలోచిస్తావ్. నేనేదడిగినా వెంటనే సరే అనవు. అయినా వొంటికాయ సొంఠికొమ్ములా ఒక్కదానివి. వచ్చిన డబ్బంతా ఏం చేస్తావేం".

ఈ ప్రశ్న వినీ వినీ విసుగెత్తిపోయింది సీతకి. నిజానికి ఇది అరిగిపోయిన రికార్డు. అయినా బలరాం మాటలు ఈటెల్లా గుచ్చుకున్నై సీతకి. కానీ, వాడు తన తమ్ముడు. సీత స్తబ్దంగా కూర్చుండిపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినై సీతకి. తనను తాను సంబాళించుకుంది.

"దానికేం నువ్వా వెళ్ళిరారా" అంది.

"గుడ్. మై సిస్టర్ ఈజ్ వెరీగుడ్." అని ఉత్సాహంగా లేచి "నేను ఇంటికి పోతాను కీ ఇవ్వు. అయితే సాయంత్రం వచ్చేటప్పుడు డబ్బు తెస్తావుగా. నేను రాత్రి బండికే వెళ్ళాలి." హడావిడిగానే హెచ్చరించాడు బలరాం.

సీత్లో కొచ్చి బ్యాగ్‌లో కీ తెచ్చి బలరాం కిచ్చింది. అతను బూట్లు చప్పుడు చేస్తూ చకచకా వెళ్ళిపోతుంటే— వెనక నుంచీ అంది. "బాలూ— కుక్కర్‌లో అన్నం వుంది. పెట్టుకు తిను". తల ఆడిస్తూ వెళ్ళిపోయాడు బలరాం.

—సీట్లో కూర్చున్నదేగానీ, పనిమీదకి మనసు పోవడం లేదు సీతకి.

*　　　*　　　*

పగలు పదకొండున్నర—

పోస్ట్ వచ్చింది. రెండు కవర్లు వచ్చేయి. అవి ఎక్కడి నుంచీ వచ్చాయో తెలుస్తూనే వుంది.

ఒకటి తెరిచింది. సుమతి రాసింది. "అక్కా నా కిప్పుడు ఎనిమిదో నెల వచ్చింది. నీకూ తెలుసుగా, ఈసారి కూడా సిజేరియన్ చేయాల్సిందే గదా. హాస్పటల్ ఖర్చు రెండువేలనాన్న అవుతుందంటున్నారు మీ మరిది. రేట్లు పెరిగినై గదా. మా సంసారం పరిస్థితి నీకు తెలియంది కాదు. కనీసం వో వెయ్యి సర్దు. ఆలోచిస్తూ కూర్చోకు. అసలే నువ్వు నేనేదడిగినా వెంటనే సరే అనవు. అయినా ఒంటికాయ శొంఠికొమ్మలా ఒక్కదానివి. వచ్చిన సంపాదనంతా ఏం చేస్తావేం?" సుమతి మాటలు ఈటెల్లా గుచ్చుకున్నై సీతకి. కానీ సుమతి తన చెల్లెలు. అవసరంలో వుండి రాసింది.

అయినా సీతకి బాధ కలిగింది. తన జీవితానికి తమ్ముడూ చెల్లెలూ చెప్పే భాష్యం ఒక్కటే!

చెమర్చిన కళ్ళను పమిటకొంగుతో తుడుచుకుని, రెండో ఉత్తరం తీసింది. పెద్దన్నయ్య రామ్మూర్తి రాశాడు.

"సీతా, నీ సలహా ప్రకారం సావిత్రికి కడియాలవారబ్బాయి సంబంధం చూశాము. వాళ్ళకి పిల్ల నచ్చింది. కట్న కానుకలూ మాట్లాడుకొని నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నాం. కట్నం పదివేలు. పైన మనకెంత లేదన్నా పదివేలు కావచ్చు. నేను నా అందుబాటులో వున్న లోన్లూ అవీ పెట్టి డబ్బు సేకరిస్తున్నాను. నువ్ మాగ్జిమమ్ పంపు. కనీసం నువ్వో ఐదువేలన్నా పంపుతావనే నమ్మకంతో ముందుకు పోతున్నాను. నీకు ప్రత్యేకంగా రాయాల్సినదేం వుంది. నా పరిస్థితులూ నీకు తెలుసు కదా. అయినా, ఒంటరిదానివి. వచ్చిన సంపాదనంతా నువ్ మాత్రం ఏం చేస్తావ్ కనక ?"

చివరగా అదే మాట. ఈటెలా గుచ్చుకునే మాట !
సీత స్తబ్దంగా కూర్చుండిపోయింది.

తమ్ముడు బలరాంకి ఎక్స్‌కర్షన్‌కి డబ్బు కావాలి ?

చెల్లెలు సుమతికి సిజేరియన్‌కి డబ్బు కావాలి ?

అన్నయ్య రామ్మూర్తికి సావిత్రి పెళ్ళికి డబ్బు కావాలి ?

తనకు ?—తనకేమీ అక్ఖర్లేదు. తనకు ఏ అవసరాలూ లేవు.

అవును. తను ఒంటికాయ శొంఠికొమ్ములా ఒక్కతే ! తన డబ్బంతా వాళ్ళ వాళ్ళ అవసరాలకి ఉపయోగపడాలి. తాను అందరినీ అన్ని సమయాల్లోనూ ఆదుకోవాలి.

"ఏమిటి సీతాదేవిగారూ ? ఉత్తరాలు మీ మూడ్ని పాడుచేసినట్లున్నై" అడిగేడు శేఖరం.

తలెత్తి అటుకేసి చూసింది.

అవే మూగచూపులు.

"అహఁ ఏఁవీ లేదు" పొడిగా సమాధానం చెప్పి పూరుకుంది.

"మరేం లేదు. నేనే విధంగానైనా సహాయం చేయగల నేమోనని" అన్నాడు శేఖరం.

"నో థాంక్స్" అంది సీత.

మూగగా చూస్తూ వుండిపోయాడు శేఖరం.

సీత ఆలోచన తెగకముందే లంచ్ అవర్ అయింది.

* * *

పగలు రెండున్నర గంటలు.

జీతం చేతిలో పడింది. కవర్‌ని జాగ్రత్తగా తన బ్యాగ్‌లో పెట్టుకుంది, సీత. పది నిముషాల క్రితం ఏదో స్టేట్‌మెంట్ పోవాలని కబురు చేశాడు మేనేజర్. దానికి సంబంధించిన ఫైల్లో తలదూర్చింది.

జేబులో చేతులు పెట్టుకుని, బూట్లు టకటక లాడించుకుంటూ హడావిడిగా తిరుగుతున్నాడు సుందరం. 'పేడే' నాడు అతను చాలా బిజీ. ఆరోజు మాత్రం అతను ఆఫీసులో పూర్తి కాలం వుంటాడు. తన షాపులో వాయిదాల పద్ధతిన వివిధ వస్తువులు తీసుకున్న వాళ్ళనుంచీ చాలా శ్రద్ధగా డబ్బు వసూలు చేసుకుంటాడు. కొందరి దగ్గర స్కీముల తాలూకు నెలసరి వాయిదాలు సేకరిస్తాడు.

కొంతమంది జవాన్ల దగ్గర వాళ్ళకిచ్చిన అప్పులూ, ఆ అప్పుల మీద వడ్డీలు "కలెక్ట్" చేసుకుంటూ వుంటాడు.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ—ఏదో పనివున్న వాడిలా సీత దగ్గరి కొచ్చాడు సుందరం. టేబుల్ ప్రక్కగా నిలబడి—వినీ వినపడనంత నెమ్మదిగా అన్నాడు—"మీ జవాబుకోసం పొద్దున్నుంచీ ఎదురు చూస్తున్నాను." అని.

చటుక్కున తలయెత్తి చూసింది సీత. అతని తెగువని చూసి ముచ్చెమటలు పట్టినై ఆమెకు.

అతన్ని వదిలించుకోవాలి. అంతే.

"రేపు వుదయం ఏడింటికి మా యింటికి రండి మాట్లాడు కుందాం" అంది.

సుందరం పదిసార్లు గటగటా థాంక్స్ చెప్పాడు. క్రాపు సవరించుకుని ముందుకు సాగిపోయాడు. అతని నోటివెంట సన్నని ఈల జోరుగా రాసాగింది.

ఊపిరి పీల్చుకుంది సీత.

స్టేట్‌మెంట్‌కోసం మేనేజర్ చిట్ పంపేడు. మనస్సుని ప్రస్తుతంలోకి లాక్కొచ్చింది. బలవంతాన పనిలో మునిగింది.

పియఫ్ లోనుకీ, సొసైటీ లోనుకీ ఫారాలు పూర్తిచేసి యిచ్చి బయట పడింది.

*                *                *

రాత్రి ఎనిమిది గంటలు.

సీత మనసు చిందర వందరగా వుంది.

బలరాం మధ్యాహ్నం తను చెప్పినట్లు ఇంట్లో భోంచెయ్య లేదు. సీత నొచ్చుకుంది. త్వరగా డబ్బిస్తే వెళ్ళిపోతానని పసిపిల్లవాడిలా మారాం చేస్తూ కూర్చున్నాడు. నాలుగొందలు యిచ్చింది. చాలవన్నాడు. గారాం పోయాడు.

తన ఘోష కొంత తమ్ముడితో చెప్పుకుంది సీత. పెద్దన్నయ్య సుమతి ఉత్తరాల గురించి చెప్పింది. అవేమీ చెవి కెక్కలేదు బలరాంకి. కొసరడం మొదలెట్టాడు వంద తర్వాత మరో వంద యిచ్చింది. అక్కడికి ఆరు పడవల్ని జేబులో కుక్కుకున్నాడు. నే వస్తా అంటూ లేచాడు. భోజనం ప్రసక్తి వచ్చింది. నేను ఏ సీ హోటల్లో చేసి పోతానని జారుకున్నాడు.

సీతకి ఏడుపొచ్చింది. వీడిని పట్టుపట్టి తాను కాలేజీలో చేర్పించింది. వీడికీ తానంటే కించిత్తు గౌరవం, మమత, అభిమానం లేవు, తన డబ్బుమీదే చూపూ భక్తి. పెద్దన్నయ్యకీ అంతే. తాను నెలసరి జీతం లెఖ్ఖ చెప్పాలి. ఆయన అవసరాల కన్నిటికీ తాను ఆదుకోవాలి. సుమతీ అంతే. ఆడపిల్ల గదా అని దానికి పూసలూ గాజులూ, చీరెలూ సారెలూ ఎక్కువగానే అమరుస్తుంది తాను. అయినా, దానికీ తృప్తిలేదు. తానేదో కొరత చేస్తున్నదనే భావనే. చిన్నన్నయ్యకి తనంటే అసలు పడదు. కోపం. తాను పెద్దన్నయ్య సంసారానికి దగ్గర అనీ వాళ్ళింట్లో మనిషిలా మెలుగుతుంది కానీ—తమకు సన్నిహితంగా వుండదనీ భావన. పెళ్ళాం తనూ ఉద్యోగస్థులు కనుక తమకు

కష్టా లెక్కువనీ అందువలన తను వచ్చి వాళ్ళ పిల్లల పోషణా అవీ చూసుకుంటూ వుండలేదనీ కోపం.

అందరూ చివరికి తనని నిందించేవారే. ఒక్కరికీ తానంటే జాలి లేదు, తన జీవితం గురించిన శ్రద్ధ లేదు.

సీతకి మనసు బరువెక్కింది.

లేచి డాబామీదికి వచ్చింది.

పిట్టగోడమీద కూర్చుంది. క్షీణ చంద్రుడు మసక వెన్నెలని పరుస్తున్నాడు. సీత నీడ వెనక్కి పొడుగ్గా సాచుకుని వుంది. వెనక్కి చూసింది. తన నీడ తననే వెక్కిరిస్తోంది అనిపించింది, సీతకి. తన వాళ్ళంతా అనే మాట పదే పదే చెవుల్లో మార్మోగుతోంది. "నీకేఁవిటి ఒంటికాయ శొంఠికొమ్ములా వొంటరి దానివి. వచ్చిన సంపాదనంతా ఏం చేస్తావేం".

వేదాంతిలా నవ్వుకుంది. అవును ఏం చేస్తుంది. పెద్దన్నయ్యకీ, చెల్లెలికీ, తమ్ముడికీ ఇస్తుంది. కానీ, రేపు తను రిటైర్ అయితే—కాక, తనకేమైనా మందో మాకో లాంటి అవసరం వస్తే—వీళ్ళంతా ఆదుకుంటారా ?—తనకు తెలుసు ఎండమావిలాంటిది ఆ ఆశ.

అసలు తను ఒంటరిది కావడం తన నేరమా ?

సీత కళ్ళల్లో నీళ్ళు ఉబికినై.

రాజేంద్రతో తన సంసారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగుతుందని ఆశించింది. తన ఆశలన్నీ పుటుక్కుని

తెగిపోయాయి. మామూలుగా రోజూలా కాలేజీకి వెళ్ళాడు లెక్చరర్ రాజేంద్ర - సాయంత్రం ఇంటికి చేరింది అతని శవం. హార్ట్ఎటాక్ అన్నారు. ఆ సంఘటన తన జీవితబలాన్ని తినేసింది. ఆరేళ్ళనుంచీ తాను ఒంటరిది. ఆఫీసుకు బయల్దేరితే - అనేక జతల చూపులు తనమీదే. ఆఫీసులోనూ అంతే. మగవాళ్ళంటే తనకు అసహ్యం కలుగుతోంది. సుందరం ఒకడు. తనని నీడలా వెంటాడుతున్నాడు. శేఖరం తన భావాల్ని బయటికి చెప్పుకోలేని స్వయంపాకం మనిషి. అతని అంతర్యమూ తనకు తెలుసు. అతనికీ తన మీద మనసుంది. తన వాళ్ళకి - అన్నయ్యకీ, చెల్లెలికీ, తమ్ముడికీ తన సంపాదన మీద మనసుంది.

మరి తనకు? తన మనస్సు ఏనాడో మంటల్లోకి విసిరివేయ బడింది.

జరుగుతున్న సంభవాలూ, సంఘటనలూ నిన్న మొన్నటి నుంచీ తనలో అంతర్మథనాన్ని రేపినై. తన మనస్సు కూడా మళ్ళీ ప్రాణం పోసుకుని పైకి లేస్తానంటోంది, కారణం? -

సుందరం చొరవా? లేక శేఖరం మూగచూపులా? కాక, తన వొంటరితనమే తనకు శాపంగా మారి, తనవాళ్ళ చేత దోపిడీ చేయబడుతున్నాననే భయమా?

ఏమిటో మరి! తన మనస్తత్వం మాత్రం మార్పుకు లోనవుతోంది?! -

ఇదేదో పరీక్ష సమయంగానే తోస్తోంది. మనోబుద్ధి, చిత్తాహంకారాల మధ్య జరిగే మథనానికి ప్రతిధ్వనిలా ఎక్కడో

దూరంగా లారీల హారన్‌ల రొద, కుక్కల మొరుగుడూ వినిపిస్తున్నై. గుంభన లేని సంసారంలా వెలాతెలాపోతున్నది ఆకాశం.

మనస్సంతా ఏమిటో ఉలికేసినట్టు అయింది సీతకి. చాలా సేపు అలాగే కూర్చుండిపోయింది. తాను ఒక నిర్ణయానికి రావడం అవసరమనే అనిపిస్తోంది అనుకుంది.

కావాలని కూర్చోలేక కూర్చున్నట్టు లేచింది సీత.

బరువుగా అడుగులు వేస్తూ గదిలోకి వచ్చేసింది.

* * *

మంగళవారం—

తెల్లవారుతూనే వచ్చేశాడు సుందరం. ట్రిమ్ గా తయారైనాడు. హాల్లో కూర్చోబెట్టింది సీత. కాఫీలు అయినై.

"చెప్పండి" ఏ భావమూ బయటపడనీయని జాగ్రత్త తీసుకుంటూ ఎంతో మామూలుగా అడిగింది సీత.

"చెప్పాను గదా నా కోరిక. మీరే మీ జవాబు చెప్పాలి".

పమిటకొంగు బొటనవ్రేలికి చుట్టుకుంటూ అన్నది, "మీరు నన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నారు కదూ?"

"అవును, అవునవును మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను."

" నా గురించిన వివరాలు తెలుసుకున్నారు కదూ ? "

" యస్ "

" మీకు భార్య ఇద్దరు పిల్లలు కదూ ? "

" ఊ " అన్నట్టు తల ఊపేడు.

" ఒక పని చేయండి. మీ భార్యకి ఈ విషయం చెప్పి, వొప్పించి విడాకులు తీసుకోండి. అప్పుడు మనం వివాహం చేసుకుందాం...ఓ కే " ...

సీత ప్రశ్నకు తికమకపడ్డాడు సుందరం. సీత ప్రశ్నలాంటి సలహాతో అతని మొహాన చెళ్ళున చరచినట్లైంది. అతని గొంతు మూగబోయింది. తలవంచుకుని గుటకలు మింగాడు. నెమ్మదిగా లేచి వెనక్కి తిరిగి చూడకుండా బయటికి వెళ్ళిపోయాడు.

సుందరం అటు వెళ్ళగానే "ప్రేమట ప్రేమ ఫైర్డ్ప్లే - అనుకున్నాడు ఫూల్ "—అని కసిదీరా అనుకుంది. ఆ వెంటనే గొల్లున నవ్వుకుంది సీత.

* * *

ఆరోజు ఆఫీసుకు సెలవపెట్టి ఇంటిదగ్గరే వుండిపోయింది, సీత. తెగని ఆలోచనల్లో మునిగి చాలాసేపు తర్జన భర్జన చేసుకుంది. చివరికి ఒక నిర్ణయాని కొచ్చింది. ఆ నిర్ణయానికి రావడానికి ముందు రెండు ముఖ్యమైన ప్రశ్నల్ని విశ్లేషించుకుంది.

ఎప్పుడూ అందుబాటులో పడివుండి, విలువని కోల్పోయి, చులకనగా బతుకుతూ కేవలం తనవాళ్ళ అవసరాలకోసం తన సంపాదనని ఉపయోగిస్తూ, యాంత్రికంగా బతకడం ఎందుకు? అనేది మొదటి ప్రశ్న. సమాజం, ఆచార వ్యవహారాలూ, సంప్రదాయం అంటూ తనను తాను దైహికంగా, మానసికంగా హింసించుకుంటూ—చుట్టూవున్న ముళ్ళ పొదల్నించీ తప్పించుకుంటూ, జీవితాన్ని నరకం చేసుకుంటం ఎందుకు? అనేది రెండవ ప్రశ్న.

ఎవరో మహాత్ములూ, గుండె నిబ్బరం గల అతీత వ్యక్తులూ ఏకాంతంలో జీవితాన్ని వెళ్ళదీయవచ్చు, కానీ తాను సామాన్య స్త్రీ. ముప్పై అయిదేళ్ళ ప్రాయం తనది. తన జీవితానికీ రక్షణ కావాలి.

*　　　*　　　*

—సీతా శేఖరంలు పెళ్ళిచేసుకున్నారనే వార్త ఆఫీసులో అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. దాదాపు అందరూ "ఇద్దరూ వెధవలేగా...జంట కలిసింది" అని నవ్వుకుంటూ చెప్పుకునీ, చెప్పుకుంటూ నవ్వుకునీ తృప్తి పడ్డారు.

తన వాళ్ళందరి దృష్టిలోనూ ఆ మర్నాటినుంచే సీత చచ్చిపోయింది. అదీ వాళ్ళు ఆమెపట్ల తమ అసంతృప్తికీ, కసికీ, ద్వేషానికీ యిచ్చిన పదచిత్రం!

వారం రోజుల తర్వాత,

ఓ రాత్రి—పన్నెండు దాటుతుండగా ఇంటికి వచ్చేడు, శేఖరం. అతని రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్న సీతకి అతను ఇంట్లోకి అడుగుపెడుతుండగానే విషయం అర్థమైంది.

“సారీ-సీతా...రాధ పోయిన తర్వాత అలవాటయింది.” అంటూ తూలుతూ బెడ్‌రూమ్‌లోకి దారితీశాడు శేఖరం.

సీత గుండెలు పిండుతున్నట్లైంది. విడిచేసిన వస్త్రంలా అక్కడే పడిపోయింది.

ఇప్పుడు సీత—

పెనంలోంచి పొయ్యిలో పడిపోయిన ఆడది !

0o0